## కష్టాల్లో ఉన్న వారికి బీఆర్ఎస్ అండ



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దశరథ్‌నాయక్, ఆనంద్, లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 14 : మండల పరిధిలో కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన మూడ పాపయ్య, ముత్యాల పోచ్చమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. బాధిత కుటుంబాలను సోమవారం స్థానిక కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి, మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలకు దశరథ్‌నాయక్, ఆనంద్, లక్ష్మీనర్సింహారెడ్డి పది వేల చొప్పున రూ.30 వేలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని తెలిపారు. పదవులు లేకపోయినా నిత్యం అందుబాటులో ఉండి ప్రజలకు సేవలనందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలయ్య, హెచ్‌ఆర్ మహేశ్, నర్సింహ, అంజి, మహేశ్‌గౌడ్, జంగయ్య, సురేశ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీకి నాయకుల పరామర్శ



చెంచు సంఘం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మండ్లీ రాములును పరామర్శిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 14 : మండల పరిధిలోని శంకర్‌కొండ గ్రామ పంచాయతీకి చెందిన చెంచు సంఘం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మండ్లీ రాములు మాతృమూర్తి జంగమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డిలు వేర్వేరుగా పరామర్శించారు. జంగమ్మ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం ఆమె కుమారుడు మండ్లీ రాములును పరామర్శించారు. పరామర్శించిన వారిలో వివిధ పార్టీల రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్, ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు గుర్రం కేశవులు, కృష్ణానాయక్, వస్పుల మానయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, నాయకులు విజయ్ నాయక్, దుర్గయ్య, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.


## అన్ని దానాల్లో అన్నదానం చాలా గొప్పది



కడ్తాల్‌లో అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చెన్నకిశన్‌రెడ్డి, వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్, ఏప్రిల్ 14: అన్ని దానాల్లో అన్నదానం చాలా గొప్పదని లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ చెన్నకిశన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా అన్నారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన సంఘ సేవకులు గంప లక్ష్మయ్య వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో గంప లక్ష్మయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీల్స్.. వీల్స్ కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ట్రస్ట్ తనపున చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం 350 మందికి అన్నదానం నిర్వహించిన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, క్లబ్ సభ్యులు గంప శ్రీను, గోవర్ధన్‌రెడ్డి, బీచ్యానాయక్, వెంకటేశ్, రమేశ్‌గుప్తా, రాముగుప్తా, వీరేంద్రగుప్తా, సాయి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, నర్సింహ, రాఘవేందర్, సతీశ్, శ్రీకాంత్, రామకృష్ణ, మహేశ్, జగదీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న అంబేద్కర్ యువజన సంఘ అధ్యక్షుడు వగ్గు మహేశ్

ఆమనగల్లు, ఏప్రిల్ 14 : పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని అంబేద్కర్ యువజన సంఘ అధ్యక్షుడు వగ్గు మహేశ్ అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆమనగల్లు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న మహిళలకు సొంత నిధులతో చీరలు సమకూర్చి వారికి అందజేశారు. ఈ సందర్భంగా వగ్గు మహేష్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు ఒక్క రోజు తమ విధులు నిర్వర్తించకుంటే గ్రామాలు చెత్తచెదారంతో నిండి పోయి రోగాల బారిన పడుతామన్నారు. ప్రతి ఒక్కరూ వారికి ఏదో రూపకంగా అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు, వివిధ రాజకీయ, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన చిలుకూరు ఆలయ బ్రహ్మోత్సవాలు



గండిపేట జలాశయంలో చక్రస్వామికి స్నానం చేయిస్తున్న అర్చకులు

మొయినాబాద్, ఏప్రిల్ 14 : వారం రోజుల నుంచి కొనసాగుతున్న చిలుకూరు బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాలు చక్ర తీర్థంతో ముగిసాయి. ఈ నెల 7న ప్రారంభమైన ఉత్సవాలు అంకురార్పణతో మొదలై సోమవారం చక్రతీర్థంతో ముగిసాయి. చక్రస్వామిని ఆలయ సమీపంలో ఉన్న గండిపేట జలాశయంలోనికి తీసుకెళ్లిన ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య చక్ర స్నానం చేయించారు. అనంతరం చక్ర స్నానం నీళ్లను తీసుకొచ్చి ఆలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ధ్వజస్తంభంపై ఉన్న గరుడ పతాకాన్ని ధ్వజారోహణం చేసి బ్రహ్మోత్సవాలు ముగిసాయని ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల్‌కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్ ప్రకటించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు సోమవారం ప్రభుత్వ విప్, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.



ఇబ్రహీంపట్నం: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, తదితరులు



మొయినాబాద్: అజీజ్‌నగర్ పాత గేట్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి



కేశంపేట: ఎక్లాస్‌ఖాన్‌పేటలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

# అంబేద్కర్.. అందరివాడు

- జిల్లాలో ఘనంగా జయంతి ఉత్సవాలు
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, అధికారులు, నాయకులు

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అందరివాడని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని, ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. - న్యూస్ నెట్‌వర్క్, రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 14



ఆమనగల్లు :అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



కడ్తాల్ : కడ్తాల్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మంచాల : బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కడ్తాల్ :తలకొండపల్లి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్



షాబాద్: చందనవెల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళ్లులర్పిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ ప్రభాకర్‌రెడ్డి



పెద్దఅంబర్‌పేట : అంబేద్కర్ జయంతి వేడుకలో మాట్లాడుతున్న యాదవ విద్యావంతుల రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్



ఆదిబట్ల : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు పల్లె గోపాల్‌గౌడ్ తదితరులు

## అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- గుంతలమయంగా మారిన రహదారులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా అంతారంలోని ప్రధాన రోడ్డు

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 14 : గ్రామాల్లో రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. వంద మీటర్లు కూడా గుంతలు లేని రోడ్లు లేవంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. పాత రోడ్లు వర్షాలు, హెవీ వెహికిల్స్‌తో దెబ్బతినడంతో గుంతలయ మయంగా తయారయ్యాయి. ప్రభుత్వం మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణం నరకంగా మారుతున్నది. చేవెళ్ల మండల పరిధిలోని గ్రామాల రోడ్లు దుస్థితి ఇలాగే ఉన్నది. అంతారం, హస్తేపూర్, కౌకుంట్ల, దుద్దాగు గ్రామాల ప్రధాన దారులు గుంతలమయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

**మరమ్మతులకు నోచుకోని రోడ్లు..**

వర్షాలకు, పెద్ద వెహికిల్స్ తిరగడంతో రోడ్లు గుంతలయమంగా తయారయ్యాయి. అందుకు తోడు కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు అంతా ఇంతాకావు. ఈ రోడ్లలో ప్రయాణిస్తున్న వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు.



గుంతలు, మట్టి రోడ్డుతో దర్శనమిస్తున్న దుద్దాగు ప్రధాన దారి

## రక్తదానం ప్రాణదానంతో సమానం




చేవెళ్లటౌన్: రక్తదానం చేస్తున్న యువకులు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 14 : రక్తదానం ప్రాణదానంతో సమానమని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్ తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తహీనతతో చాలా మంది బాధపడుతున్నారని, ప్రమాదాలు జరిగిన సమయంలో రక్తం లభించక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**కాకునూరులో..**

**కేశంపేట :** మండల పరిధిలోని కాకునూరులో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదాతలను ఉద్దేశించి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. మానవత దృక్పథంతో రక్తదానం చేసేందుకు యువతీ యువకులు ముందుకు రావాలన్నారు. రక్తదానం చేయడంతో కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందని, ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు పత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో లింగం, మల్లేశ్, అనిల్, రమేశ్, బాలరాజ్, శేఖర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : రక్తదానం చేస్తున్న యువకుడితో యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నందిగామ, ఏప్రిల్ 14 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో వెలుగు చూసింది. స్థానికులు, పోలీసులు తెలిసిప వివరాలు.. నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన ప్రశాంత్‌రెడ్డి (32)గత కొన్నేండ్లుగా భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి షాద్‌నగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఫోన్ ఇంట్లో పెట్టి బయటకు వెళ్లిపోయాడు. సోమవారం కొత్తూరు సమీపంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు తెలియడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు వచ్చి చూసి ప్రశాంత్‌రెడ్డి మృతదేహంగా గుర్తించారు. మృతదేహం పక్కనే పురుగుల మందు డబ్బా ఉన్నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అరుదైన క్యాన్సర్‌కు కిమ్స్‌లో చికిత్స

**రెండేళ్ల బాలుడి ప్రాణాలు కాపాడిన వైద్యులు**



చికిత్స చేసిన బాలుడితో కిమ్స్ వైద్యులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): రెండేళ్ల బాలుడికి అరుదైన క్యాన్సర్ సోకింది. పదిలక్షల మందిలో దాదాపు 8మందికి సోకే న్యూరోబ్లాస్టోమా క్యాన్సర్ ఆ చిన్నారి ఆరోగ్యంపై వేటు వేసింది. సాధారణంగా 5 ఏళ్ల వయసులోపల గల పిల్లలకే వచ్చే ఈ వ్యాధికి కిమ్స్ వైద్యులు విజయవంతంగా చికిత్సనందించారు. చిన్నారిని బతికించుకోవడం కోసం తల్లిదండ్రులు చివరి ఆశగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. శస్త్రచికిత్స చేసి నయం చేసిన ప్రముఖ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మధు దేవరశెట్టి మాట్లాడుతూ..'హైదరాబాద్ లాలాపేట్ ప్రాంతానికి చెందిన రక్షిత్ అనే ఆ రెండేళ్ల బాలుడికి న్యూరోబ్లాస్టోమా ముదిరిన దశలో ఉంది. దాంతో అతడికి శస్త్రచికిత్స చేయడం చాలా సంక్లిష్టంగా మారింది. మా బృందంలోని వైద్యులంతా అత్యంత నైపుణ్యంతో శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం రక్షిత్ చాలా వేగంగా కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ విడుదల



కొత్తపేటలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను అతికిస్తున్న నేతలు

కేశంపేట, ఏప్రిల్ 14: మండల పరిధిలోని కొత్తపేటలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను మాజీ సర్పంచ్ కామ్లెకార్ నవీన్‌కుమార్, నాయకులు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఆవిర్భవించి ఏప్రిల్ 27తో 25ఏండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేద్దామన్నారు. అనంతరం గ్రామ ముఖ్యకూడలితోపాటు జనసాంద్రత ఉన్న ప్రదేశాల్లో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను అతికించారు.


## కొందుర్గు పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ రాకేశ్

కొందుర్గు, ఏప్రిల్ 14 : శంషాబాద్ డీసీపీ రాజేశ్ సోమవారం కొందుర్గు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. 100కు ఫోన్ వస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించాలన్నారు. కేసులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం సీజ్ చేసిన వాహనాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐ నర్సయ్య, ఎస్సై రవీందర్‌నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేత ఇంటికి మందకృష్ణమాదిగ



ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగను సన్మానిస్తున్న పీఏసీఎస్ మాజీ చైర్మన్ విఠల్

నందిగామ, ఏప్రిల్ 14: చేగూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత మామిళ్ల విఠల్ ముదిరాజ్ ఇంటికి ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా మందకృష్ణమాదిగను బీఆర్ఎస్ నేతలు సన్మానించి స్వాగతం పలికారు. మందకృష్ణమాదిగతో కొన్నేండ్లుగా ప్రత్యేక అనుబంధం ఉందని, మర్యాదపూర్వకంగా ఇంటికి వచ్చినట్లు విఠల్ తెలిపారు. కార్యక్రమంలో మిట్టపల్లి సురేందర్, మహేశ్, దేవదాస్, నరేందర్, రవి, ప్రశాంత్, యాదగిరి, బబ్లుయాదవ్, ప్రసాద్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు మున్సిపాలిటీలోని 11వ వార్డులో సన్న బియ్యం లబ్ధిదారుడు గాలికాని ఇస్తారి ఇంట్లో సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భోజనం చేశారు. - నందిగామ, ఏప్రిల్ 14